# "Telugu" gaining popularity in USA

"ఏడాది క్రింద తెలుగులో ఎప్పటికయినా మాట్లాడగలనా అనుకునేవాణ్ని. తెలుగు చాలా కష్టమయిన భాష అనీ, నేర్చుకోవడం చాలా చాలా కష్టమనీ అందరూ బెదరగొట్టారు. కాని, అదంతా వొట్టి భయమే తప్ప తెలుగు చాలా తేలిక అని ఇక్కడ తెలుగు కోర్సు చేసాక అర్థమయ్యింది. ఇవాళ తెలుగు అంటే నాకు అమితమయిన ప్రేమ. వ్యక్తిగతంగా ఇది నాకు చాలా గొప్ప విజయం అనిపిస్తుంది" అన్నాడు బ్రైస్ రాబిన్సన్ . అమెరికా లోని ఏ యూనివర్సిటిలో అయినా ప్రతి అండర్ గ్రాడుయేషన్ కోర్సులో ప్రతి విద్యార్థి నాలుగు సెమిస్టర్లు ఒక బాషా కోర్సు చెయ్యాలి. అలా ఆస్టిన్ లోని టెక్సస్ యూనివర్సిటి బిజినెస్ స్కూలు లో అండర్ గ్రాడుయేషన్ కోర్సులో వున్న బ్రైస్ దృష్టి తెలుగు భాష వైపు మళ్ళింది. ఈ ఏడాది ఉత్తమ విద్యార్థులుగా బ్రైస్. ప్రియా కుమార్ ఎలిజబెత్ లు తానా అవార్డులు గెలుచుకున్నారు. తెలుగు దినోత్సవ సభలో తెలుగు విశ్వవిద్యాలయ మాజీ వైస్ చాన్సలర్ ఆవుల మంజులత చేతుల మీదుగా ఈ ఇద్దరు విద్యార్థులకు తానా తెలుగు అవార్డులు ప్రదానం చేసింది.

మరో విద్యార్థిని ప్రియా కుమార్ ఎలిజబెత్ కథ వేరే!

ప్రియ నాన్నగారు ఆంధ్రా నుంచి, అమ్మగారు లండన్ నుంచి! ----ఎలాగయినా తెలుగు నేర్చుకొని, ఆంధ్రాలో వున్న నానమ్మ వాళ్లతో తెలుగులోనే మాట్లాడాలని అనుకుంది ప్రియ. తెలుగు నేర్చుకోవడం ఎలా అని ఆలోచిస్తూ ఒక రోజు సరదాగా టెక్సస్ యూనివర్సిటి కోర్సుల జాబితా గాలించింది. అంతే, తెలుగు అని కనిపించగానే ఎగిరి గంతేసింది. వెంటనే తెలుగు కోర్సులో చేరింది. "కాని, ఈ కోర్సులో చేరుతున్నప్పుడు చాలా భయం వేసింది. అప్పటి దాకా

నాకు తెలుగులో రెండంటే రెండే మాటలు తెలుసు – నానమ్మ, పిల్లి. ఒక సెమిస్టరు కాకుండానే ఇప్పుడు నేను తెలుగులో మాట్లాడుతున్నాను, రాస్తున్నాను, తెలుగు చదువుతున్నాను. ఒక్కోసారి ఇది నిజమా, ఇంత తొందరగా తెలుగు నేర్చుకున్నానా అని నాకే ఆశ్చర్యంగా వుంటుంది. ఈ సారి నేను ఆంధ్రా వెళ్తే నానమ్మతో తెలుగులోనే మాట్లాడ గలను." అని గర్వంగా చెబుతుంది ప్రియ.

ఇలా ఆస్టిన్  టెక్సస్ యూనివర్సిటీలో వున్న ఇరవై మంది తెలుగు విద్యార్థులు ఇరవై తెలుగు కథలు చెప్పగలరు. వీళ్ళలో కొంత మంది తెల్లవాళ్లు. కొంత మంది ఉత్తరాది వాళ్లు. ఎక్కువ మంది మన రెండో తరం తెలుగు వాళ్లు. వీళ్లంతా ఏడాది క్రింద టెక్సస్ యూనివర్సిటి మొదటిసారిగా తెలుగు కోర్సు మొదలు పెట్టినప్పుడు కొంత ఉత్సాహంగా, కొంత బెరుకుగా తెలుగు నేర్చుకోవడం ప్రారంభించారు. తెలుగు చాలా కష్టమయిన భాష అనీ, ఏ కాస్త తేడా వచ్చినా, గ్రేడ్ దెబ్బ తింటుందనీ బెరుకు. కాని, క్లాస్  తీసుకున్న తర్వాత ఆ బెరుకు మొత్తంగా పోయింది. తెలుగు నేర్చుకోవడం ఇంత సరదాగా వుంటుందని, ఇంత తొందరగా రాత నేర్చుకొగలమనీ తాను అనుకోలేదని మరో విద్యార్థిని దీపిక అంది. "ఇక్కడ మేం భాష మాత్రమే కాదు, మా పూర్వీకుల గురించి, మా చరిత్ర గురించి, మా సాహిత్యం గురించి చాలా నేర్చుకుంటున్నాం" అంటుంది అనుపమ. " మా ప్రొఫెసర్ అఫ్సర్ ఒక సారి క్లాస్ లో ఓల్గా కథ 'సమాగమం' గురించి చెప్పారు. అది ఇప్పుడు నా డాక్టరేట్ పరిశోధనకి అంశంగా పనికొస్తోంది" అంది డాక్టరల్ విద్యార్థిని విభా సెటియా.   గత ఏడాది తానా చొరవతో టెక్సస్ యూనివర్సిటి తెలుగు కోర్సు మొదలు పెట్టాక, ఈ కాంపస్ లో దక్షిణ భారతం వైపు ముఖ్యంగా తెలుగు వైపు అందరి దృష్టి మళ్ళింది.

ఇటీవల తానా, టెక్సస్ యూనివర్సిటి ల సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం వైభవంగా జరిగింది. తానా కార్యదర్శి తోటకూర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభకి పెద్ద సంఖ్యలో తెలుగు భాషాభిమానులు హాజరయ్యారు.

